క్లుప్తంగా

కవి రాకేష్‌కు సాహిత్య సేవా పురస్కారం



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమి సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ సంబరాలలో పట్టణానికి చెందిన సాహితీవేత్త గుండాల రాకేష్‌కు సాహితీ సేవా పురస్కారం లభించింది. సంబరాలలో భాగంగా నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో తెలుగు భాషా గొప్పదనాన్ని కొనియాడుతూ ఆయన కవితా గానం చేసి ఆకట్టుకున్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి నుంచి పురస్కారం అందుకున్నట్లు రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మేళనంలో వివిధ రాష్ట్రాల నుంచి తెలుగు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.6లక్షల విరాళం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి బెంగళూరుకు చెందిన ప్రముఖ వ్యాపారస్తులు పిట్టమూడుసు లింగరాజు రూ.6,11,116ను సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పెండేల వెంకట పుల్లారావు, ప్రెసిడెంట్ పులిపాటి రామారావు, సెక్రటరీ జాజుల మాల్యాద్రి, వైస్ ప్రెసిడెంట్ చందోలు మల్లికార్జునరావు, అచ్యుత కృష్ణ, గంధం బాలిరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు, గజవల్లి పవన్, దండు చెన్నయ్య, కన్నెగండ్ల అనంత రామకోటేశ్వరరావు, గోవిందనాయక్, రెడ్డి నగేష్, తేలికపల్లి బాబు, ములకా రామతులసీరెడ్డి పాల్గొన్నారు.

నాదెండ్ల తహసీల్దార్‌గా నాగమల్లేశ్వరరావు



నాదెండ్ల: మండల తహసీల్దార్‌గా నాంపల్లి నాగమల్లేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన యడ్లపాడు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ నాదెండ్ల తహసీల్దార్‌గా పనిచేసిన ఏ.వి. రమణ పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేశారు. గతంలో నాగమల్లేశ్వరరావుకు నాదెండ్ల కార్యాలయంలో ఆర్ఐగా, సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవం ఉంది. బదిలీపై వచ్చిన ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గిడుగు పురస్కారానికి కవి కరీముల్లా ఎంపిక



వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ పట్టణానికి చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లా గిడుగు పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు ఆహ్వానించినట్లు కరీముల్లా తెలిపారు. మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో ఈ సత్కారం అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కరీముల్లా ఇప్పటివరకు 26 పుస్తకాలు రాశారు. ఆయన సాహిత్యంపై పలు యూనివర్సిటీల్లో పరిశోధనలు జరుగుతున్నాయి. ఎంఏ తెలుగు పాఠ్యాంశాలుగా ఆయన పుస్తకాలు, కవిత్వం కొనసాగుతున్నాయి. ఆంగ్లం, కన్నడ, ఒరియా, హిందీ, ఉర్దూ తదితర భాషల్లో కరీముల్లా పుస్తకాలు, కవిత్వం అనువాదమై దేశవ్యాప్తంగా మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఈ సందర్భంగా కవి కరీముల్లాను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

కుంగ్‌ఫూ పోటీల్లో చిలకలూరిపేట విద్యార్థుల ప్రతిభ



చిలకలూరిపేట: ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు ఆదివారం నిర్వహించారు. ఇందులో చిలకలూరిపేట పట్టణానికి చెందిన న్యూ షావోలిన్ కుంగ్‌ఫూ అకాడమి విద్యార్థులు సాత్విక్, సమీర్, షణ్ముఖ, సోహెల్, తేజా, వెంకటేష్, చిరాగ్ సింగ్, సంజయ్ కటా విభాగంలో ఎనిమిది బంగారు పతకాలు సాధించారు. పట్టణంలోని సీఆర్ క్లబ్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో కుంగ్‌ఫూ మాస్టర్లు షేక్ దరియావలి, బత్తుల విక్రమ్, యడ్ల సురేష్, దుర్గా ప్రసాద్, రబ్బానిపాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తూ సువర్ణపాలన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. గణపవరం నాలుగో వార్డులో సోమవారం నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో మంత్రి రజిని మమేకమయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, యువతను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల్ని వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. ముందుగా చిలకలూరిపేట డొంక రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన పథకాలతో పాటు అభివృద్ధి పనుల్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్ని గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయని చెప్పారు. ఇది ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతమైన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. అన్ని పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్దఎత్తున అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. దీంతో ఆయా వర్గాలకు పాలనలో భాగస్వామ్యం లభించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతంపైగా అమలు చేశామన్నారు. గడిచిన టీడీపీ ప్రభుత్వంలో ఏ మేలు అందాలన్నా టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని వివరించారు. ఇంటి మీద, ఒంటిపై పచ్చ జెండా వేసుకుంటేనే పథకాలు ఇచ్చేవారని విమర్శించారు. అవినీతి, అరాచకాలకు భయపడి ప్రజలు టీడీపీ అంటేనే విసుగెత్తారని మంత్రి పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు అందాలంటే పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగేవారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని ఇంటి ముందుకే తలుపుతట్టి అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని వివరించారు. ప్రతి ఇంటికీ ఎన్నో సంక్షేమ పథకాలు అందాయని, దీంతో ఆయా కుటుంబాల్లో సంతోషం నిండిందని తెలిపారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరో దఫా ఆశీర్వదించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం. వీరారెడ్డి, మాజీ సర్పంచి కెల్లంపల్లి సుందరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాట్రు రమేష్, నాలుగో వార్డు ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు షేక్ ఆదాంవలి, తులం సుధాకర్, బొప్పూడి రామారావు, నాయకులు సూరా శంకరరెడ్డి, కొండెపాటి నాగయ్య, అవ్వారు సుబ్రహ్మణ్యం, గాలి బుచ్చయ్య, కాటా రత్తయ్య, సూర్యనారాయణ, పెనుమల భీమయ్య, గుంజి ప్రసాద్, సొంగ వెంకటేష్, బాబు, మలకా గురునాథం, నంబూరి నాగేశ్వరరావు, పట్టంశెట్టి కిరణ్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నన్నెబోయిన శ్రీనివాసరావు, మండలనేని సుబ్బారావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఆంజనేయులు, అవ్వారు హనుమంతరావు, గాలి హనుమంతరావు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు

నరసరావుపేట రూరల్: ఎస్సీ రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు అందిస్తున్నట్టు ఉద్యానశాఖ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని యల్లమంద రైతు భరోసా కేంద్రంలో మిరప, ఉద్యాన పంటలపై సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు అవసరమైన రైతులు ఉద్యాన శాఖ అసిస్టెంట్ లేదా గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలని సూచించారు. నీటి వసతి లేని ప్రాంతాల్లో బోరు, గొట్టపు బావుల ద్వారా రైతులు మిరప పంటను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సాయినాథ్, ఎంపీఈవో షేక్ మస్తాన్‌వలి, ఫీల్డ్ అసిస్టెంట్ కాశీ రామారావు, రైతులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

వినుకొండ టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11గంటలకు సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి తెలిపారు. సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి వైస్ చైర్మన్లు, వార్డు, కో- ఆప్షన్ మెంబర్లు, ఎక్స్‌అఫీషియో మెంబర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా ఆధ్యాత్మిక సేవా స్రవంతి వార్షికోత్సవం



ఆధ్యాత్మిక ప్రవచకులు కైలాసనాథ్‌ను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీ శృంగేరి శంకర మఠంలో ఆదివారం రాత్రి ఆధ్యాత్మిక సేవా స్రవంతి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న పదిమంది ప్రతిభ గల పేద విద్యార్థులకు నిర్వాహకులు ఆర్థిక సాయం అందించారు. శ్రావణ మాసం – దేవి వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచకులు మల్లాది కైలాసనాథ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా తోట వెంకట దీప్తి శ్రేయ, మిన్నికంటి జ్ఞానసరస్వతి ప్రదర్శించిన భరత నాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, యోగా గురువు కూనిశెట్టి వెంకట జనార్దన్, సంస్థ వ్యవస్థాపకుడు జల్లి శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు మునగా శ్రీనివాసరావు, దోరెడ్ల శ్రీనివాసరావు, కోశాధికారి మండవ వెంకటరత్నం పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: చందవరంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో నాదెండ్ల పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్ఐ బలరామిరెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలంలో ముగ్గురు జూదరుల్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8,500 స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు పరారయ్యారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యడ్లపాడు మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సుజాత



సుజాతకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

యడ్లపాడు: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జి. సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్. నాగమల్లేశ్వరరావును పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఉన్నతాధికారులు నాదెండ్ల మండలానికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో చిలకలూరిపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తోన్న సుజాతను ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు.

31న మండల పరిషత్ భవనం ప్రారంభం

ఈపూరు : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ నూతన భవనాన్ని ఈ నెల 31న స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభించనున్నట్లు ఎంపీపీ ఈదర రాధిక తెలిపారు. రూ.80లక్షలతో అత్యాధునికంగా నిర్మించిన భవనం ఉద్యోగస్తులకు అందుబాటులోకి రానుంది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో శిలాఫలకాలకే భవన నిర్మాణం పరిమితమైంది. నిర్లక్ష్య ధోరణితో మంజూరైన నిధులు కూడా వెనక్కి వెళ్లిపోయాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టుపట్టి భవన నిర్మాణం పూర్తి చేశారు. అంగలూరు సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామ సమీపంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌ను కూడా అదే రోజు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభిస్తారని సొసైటీ చైర్మన్ దుడ్డుగుల శ్రీనివాసరావు తెలిపారు. వనికుంట సమీపంలో బొల్లా బ్రహ్మనాయుడు రహదారి కోసం ఏర్పాటు చేసిన ఆర్బీని కూడా ఈ నెల 31వ తేదీన ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఎంపీపీ ఈదర రాధిక కోరారు.

ఆసుపత్రిలో చేరిన జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు

నరసరావుపేట: తనపై రెంటచింతలకు చెందిన ఏఎస్ఐ దాడిచేసి గాయపర్చాడని జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వి.మరియదాసు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన స్వల్ప గాయాలతో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేశారు. అదే సమయానికి వైద్యశాలలో ఈహెచ్‌ఎస్ విభాగం ప్రారంభించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆస్పత్రిలో మరియదాసును పరామర్శించారు. ఎస్సీ, ఎస్టీ కేసు విషయమై పిడుగురాళ్లలో ఉన్న ఏఎస్ఐ హనుమంతరావును కలసి మాట్లాడుతుండగా తనపై విచక్షణారహితంగా ఆయన దాడిచేసి కొట్టాడని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపించి న్యాయం చేస్తామని కలెక్టర్, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



గంగులపాలెం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ నూతన విగ్రహావిష్కరణ

బొల్లాపల్లి: మండలంలోని గంగులపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు మాల మహానాడు పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె. పాలు అధ్యక్షత వహించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడని పేర్కొన్నారు. ప్రపంచ మేధావిగా కీర్తింపబడ్డారని, అణగారిన, శ్రామిక వర్గాలకు రాజ్యాంగంలో హక్కులు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చార్వాక, పుష్పరాజ్, సుధాకర్, నాగమల్లేశ్వరి, అనీల, బాబూరావు, మాలమహానాడు ప్రతినిధులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



వేల్పూరులో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శావల్యాపురం: పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మండలంలోని వేల్పూరు, పోట్లూరు గ్రామాల్లో సోమవారం పాడి రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణతో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. వేల్పూరులో జరిగిన సదస్సులో ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువలో భాగంగా అమూల్ పాడి రైతులు రుణామేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు సొసైటీ బ్యాంకు ద్వారా రూ.1.60లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తామని తెలిపారు.

అనంతరం 80మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచులు రంతు శ్రీనివాసరావు, పోపూరి జ్యోతి, వైస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, ఈవోపీఆర్డీ పి.సుగుణ, పశువైద్యాధికారులు సోముల గుణధీర్, పాలపర్తి గణేష్‌కుమార్, ఏపీఎం జి.వాసుబాబు, సీసీ ఖాజావలి, పంచాయతీ కార్యదర్శులు ముంద్రు మనోహర్, ఆళ్ల యుగంధర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు స్వర్ణాల వెంకట్రావు, యానిమేటర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువ రుణమేళ

వినుకొండ(నూజెండ్ల) : నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న పాలవెల్లువ రుణమేళాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ సంచాలకులు పయ్యావుల శ్రీనివాసమూర్తి పాల్గొని, రుణమేళా నియమ, నిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి. వీరభద్రాచారి, మండల వైద్యాధికారి శివాజీ, ఈవోపీఆర్డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, జగనన్న పాలవెల్లువ రూట్ సూపర్‌వైజర్లు, వెలుగు సీసీలు, పశుసంవర్ధక శాఖ సహాయకులు, యానిమేటర్స్ పాల్గొన్నారు.

పోలేరమ్మ, అద్దంకమ్మ జాతర ప్రారంభం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న గణాచారులు, ఆచారవంతులు

రొంపిచర్ల: స్థానిక పడమటి పాలెంలో గ్రామ దేవతలైన శ్రీ పోలేరమ్మ తల్లి, అద్దంకమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పావనానికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆచారవంతులు, గణాచారులు వీరతాళ్లతో ఒరుసుకుంటూ వీరంగం ఆడారు. ప్రాచీన సంప్రదాయ వాయిద్యాలైన కొమ్ములు, జమికలతో సందడి చేశారు. మూడు రోజుల పాటు జాతరోత్సవాలు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పురపాలక పరిధిలో నివాసం ఉండే ప్రజలకు అన్ని మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం 29, 30వ వార్డుల్లో రూ.45లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, వాటర్ లైన్, పలు నిర్మాణ పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోట సెంటర్‌లోని సింధు – హిందూ అపార్టుమెంట్, ఏనుగుల బజార్, మహాలక్ష్మి చెట్టు, ఆవుల సత్రం వెనక బజార్ పరిసర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నూతనంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. 29వ వార్డులో రూ.25లక్షలు వెచ్చిస్తున్నామని చెప్పారు. పట్టణం మొత్తం 34వార్డుల్లో రూ.6.8కోట్లతో పనులు చేపడుతున్నామని, దీంతోపాటు 15వ ఫైనాన్స్‌కు చెందిన రూ.15కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. పట్టణ శివారు విలీన ప్రాంతాల ప్రజలకు అవసరమైన అన్ని వసతుల్ని కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ వార్డుల్లో అభివృద్ధి పనుల్ని విస్మరించారని విమర్శించారు. అన్ని వార్డుల్లో ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల్ని తెలుసుకొని పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా బేగం ఖాజావలి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, మాదిగ కార్పొరేషన్ డైరక్టర్ కందుల ఎజ్రా, మునిసిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, ఎంఈ డి.శ్రీనివాసరావు, ప్రవల్లిక, బత్తుల విష్ణు, గాలి సైదు, బాజీ, షేక్ సుభాని, దివ్వెల రామకృష్ణ, సయ్యద్ సుభాని, చిన్ని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న ఏఎస్‌వో నాగశ్రీనివాసరావు

ఈపూరు : స్థానిక రైతు భరోసా కేంద్రంలో పంట కోత ప్రయోగాలపై గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఆర్. రామారావు మాట్లాడుతూ ఆర్‌బీకే పరిధిలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట కోత ప్రయోగాలు చేపట్టాలని సూచించారు. పంట కోత ప్రయోగాలు చేయడానికి ప్లాటు, సర్వే, సబ్ డివిజన్ నంబరు ఎంపిక తదితర అంశాలపై మండల సహాయ గణాంక అధికారి కె. నాగశ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు. పంట కోత ప్రయోగాలకు సంబంధించిన ఫారం –1, 2 నిర్ణీత సమయంలోనే జిల్లా కార్యాలయానికి పంపాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో బి.అప్పారావు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మారథాన్ పోటీలకు స్పందన



మారథాన్ పోటీల్లో పాల్గొన్న అధికారులు, బాలబాలికలు

వినుకొండ టౌన్: ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నిరోధక సంస్థ, స్థానిక శ్రీమతి గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఐదు కిలోమీటర్ల జిల్లాస్థాయి మారథాన్ పోటీలు సోమవారం పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్ నుంచి ప్రారంభమయ్యాయి. పలు జూనియర్, డిగ్రీ కళాశాలల నుంచి 64మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ పి. పద్మావతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. పోటీలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పది మంది బాలబాలికల్ని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి. శివ ఫణీంద్ర, ఆర్ఆర్‌సీ కో–ఆర్డినేటర్ కిశోర్ బెహారా, అధ్యాపక సిబ్బంది ఎల్. మధుసూదనరావు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ ఏపీఎస్ఏసీఎస్ కె. సురేష్, ఐసీడీసీ మేనేజర్, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

భాషా పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



భాషా దినోత్సవంలో పాల్గొన్న బాల సాహితీవేత్త డాక్టర్ నాగేశ్వరరావు

యడ్లపాడు: భాషా పరిరక్షణ బాధ్యతని చెన్నైకు చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ బెల్లంకొండ నాగేశ్వరరావు చెప్పారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక నారాయణ స్కూలు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాడుక భాష పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా ఏటా ఆగస్టు 29న భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషా ఆవశ్యకత, పూర్వం –ప్రస్తుతం మాతృభాష పరిస్థితుల్ని ఆయన వివరించారు. తెలుగు భాషా పరిరక్షణకు గిడుగు చేసిన కృషిని కొనియాడారు. తెలుగు సాహిత్యంలో మన కవులు, రచయితలు ఎన్నో విలువైన రచనలు చేశారని వాటిని ప్రతి విద్యార్థి చదివి, తెలుగు భాషా గొప్పదనం గురించి తెలుసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పఠనాశక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, స్కూలు ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాశాఖ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి

బొల్లాపల్లి: విద్యాశాఖ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జిలానీ బాషా తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ సర్వేపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా విద్యార్థులకు సంబంధించి సర్వేల్ని తక్షణమే పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తికి సంబంధించి యాప్‌లో పూర్తిగా నమోదు కాలేదని, సర్వే నిర్వహించి తక్షణమే దాన్ని పూర్తి చేయాలని సూచించారు. 5–17 ఏళ్ల వయసులో డ్రాపౌట్స్‌లను గుర్తించి, ఆ యాప్‌ల్లో నమోదు చేయాలని ఆదేశించారు. మండలంలో 2800 విద్యార్థులు ఉన్నారని, వీరిని గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. వివాహమైతే వారిని ఓపెన్ స్కూల్లో చేర్పించాలని సూచించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో–2 కె.పార్వతి తెలిపారు. సమీక్షలో సచివాలయాల కేంద్రంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమ విద్యాసహాయకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వచ్చే నెల 30లోగా పన్నులు చెల్లించండి

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలో బకాయి పడిన ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నుల్ని సెప్టెంబరు 30వ తేదీలోగా చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు ప్రజల్ని కోరారు. పన్నులు చెల్లించని వారి అత్యవసర సర్వీసుల్ని తొలగిస్తామని ఆయన తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని సచివాలయ ఉద్యోగులతో పురపాలక అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా బకాయిదారుల నుంచి వెంటనే వసూలు చేసేందుకు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీరు డి. శ్రీనివాసరావు, డీఈ ఓ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.